క్లుప్తంగా

ఘనంగా సాయిబాబా వార్షికోత్సవం



బిక్కవోలులో ప్రత్యేక అలంకరణలో సాయిబాబా

బిక్కవోలు: గ్రామంలో ఊలపల్లి రోడ్డు జంక్షన్ వద్ద శ్రీకోదండ రామాలయం వద్ద సాయిబాబా ఆలయ మూడో వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఉదయం నుంచి కాకడ హారతి, పంచామృత అభిషేకాలు, బాబావారి హారతి, భజనలు, అనంతరం ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ కార్యక్రమంలోని భక్తుల విశేషంగా పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలోని ఆలయ కమిటీ సభ్యులు వైజాగ్ అబ్బు, పాలచర్ల రామకృష్ణా చౌదరి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



కొమరిపాలెంలోని శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యరాలు విజయలక్ష్మి

బిక్కవోలు: సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరమని కొంకుదురు పీహెచ్‌సీ వైద్యరాలు జి.విజయలక్ష్మి అన్నారు. ఆదివారం కొమరిపాలెం గ్రామంలోని సచివాలయం వద్ద మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులను పరీక్షించారు. రెండు టైఫాయిడ్, 12 సాధారణ జ్వరాల కేసులు నమోదైనట్టు తెలిపారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యరాలు మాట్లాడుతూ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఏపూట కాపూటే వండుకుని వేడి పధార్థాలను తినాలన్నారు. దోమ తెరలు వాడలన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తగా ఉండాలన్నారు. రెండు రోజులు మించి జ్వరం ఉంటే వెంటనే వైద్యులు సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలోని సర్పంచి వాసంశెట్టి రవికుమార్, పీహెచ్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న ఆరుగురి అరెస్టు



అదుపులోకి తీసుకున్న నిందితులతో పోలీసులు

రంగంపేట: పేకాడుతున్న ఆరుగురి వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ తోట కృష్ణసాయి తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రమైన రంగంపేట గ్రామ శివారులో పేకాడుతున్నట్టు తమకు సమాచారం అందడంతో సిబ్బందితో వెళ్లి దాడి చేశామన్నారు. ఈ దాడిలో ఆరుగురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి మూడు బైక్‌లు, రూ.3900 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్టు ఆయన చెప్పారు.

కోరుకొండ పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎం అండ్ హెచ్‌ఓ



కోరుకొండ పీహెచ్‌సీలో డాక్టర్లతో మాట్లాడుతున్న డీఎం అండ్ హెచ్‌ఓ

మధురపూడి: కోరుకొండ పీహెచ్‌సీని ఆదివారం డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటేశ్వరరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, రిజిస్ట్రార్లను పరిశీలించారు. వర్షాలు కారణంగా జ్వరాల పీడితుల వివరాలు, మందులు తదితర వివరాలను తెలుసుకున్నారు. కోరుకొండ అంకాలమ్మ గుడి వద్ద నిర్వహించిన వైద్యశిబిరానికి వచ్చి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

6న మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

రాజమహేంద్రవరం సిటీ: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణలో భాగంగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల ఆరో తేదీన వినాయక మట్టి ప్రతిమలు పంపిణీ చేయనున్నారు.ఈ విషయాన్ని ఆ సంస్థ ప్రెసిడెంట్ పాల కృష్ణప్రసాద్ రెడ్డి, సెక్రటరీ ఉప్పల శ్రీను ఆదివారం తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం 3 గంటలకు శ్యామల టాకీస్ వద్ద ఉన్న సీపీరెడ్డి హీరో హోండా షోరూమ్ వద్ద మట్టితో తయారు చేసిన వినాయక ప్రతిమలు భక్తులకు పూజా నిమిత్తం ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

అన్నదాతకు వాయుగండం

- ఏకధాటిగా కురుస్తున్న వర్షాలు
- ఆందోళన చెందుతున్న రైతులు
- సస్యరక్షణ చర్యలే శరణ్యమంటున్న వ్యవసాయాధికారులు



వరి పొలంలో సస్యరక్షణా చర్యలు చేపట్టిన దృశ్యం

రాజానగరం: ఆరుగాళం శ్రమించి పంటలు పండించే రైతన్నల కష్టం ఫలించాలంటే ప్రకృతి కరుణించాలి. ప్రకృతి ఏ మాత్రం కన్నెరజేసినా అన్నదాతల కష్టమంతా నీరుగారిపోతుంది. ప్రస్తుతం కొన్ని ప్రాంతాలలో రైతులు ఇదే పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. బంగాళఖాతంలో అల్పపీడనం వాయుగుండంగా మారి వర్షాలు పడుతూనే ఉన్నాయి. ఈ వర్షాలు ఇంకొన్ని రోజులు కురిస్తే పంటలు కోల్పోయే ప్రమాదముంది. పడిన శ్రమ, పెట్టిన పెట్టుబడులు నీటి పాలవుతుంటే ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

రాజానగరం, అనపర్తి నియోజకవర్గాలలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 64,965 ఎకరాలలో వరి పంటను సాగు చేశారు. వీటిలో అనపర్తి నియోజకవర్గంలో సాగు చేసిన 29,685 ఎకరాలలోని వరి పంటకు ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వలన పెద్దగా ఇబ్బంది లేదుగాని, రాజానగరం నియోజకవర్గంలో సాగు చేసిన 35,240 ఎకరాలలోని వరి పంటలో ఆలస్యంగా సాగు చేసిన 8,650 ఎకరాలలోని వరి పంట దెబ్బతినే పరిస్థితులు నెలకొన్నాయి. జూలైలో కురిసిన భారీ వర్షాలతో ఇప్పటికే ఒక దఫా నష్టానికి గురైన రైతులు పాడైన పంట స్థానే మరొకసారి నాట్లు వేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఆ నాట్లు నీటి మునిగడంతో మరోసారి దెబ్బతింటాయెమోనని ఆందోళన చెందుతున్నారు. ఆ నాట్లు కూడా వర్షాలకు దెబ్బతింటే ఇక సాగు చేయడం ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా చాలా కష్టం. అంతేకాక వరి నారు కూడా దొరకదు.

ఆందోళన వద్దు– సస్యరక్షణే మార్గం

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు వరి పంటకు సమస్యాత్మకంగా మారాయి. ఈ నేపథ్యంలో దివాన్‌చెరువులో ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకటనరసింహరావు అన్నదాతలను చైతన్య పరుస్తూ సస్యరక్షణ చర్యలు చేపట్టి, భారీ నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

పొలం నీటిలో మునిగితే

నాట్లు వేసి వారం నుంచి 30 రోజులైతే పొలంలో నీరు ఐదు రోజుల వరకు నిల్వ ఉన్నా ఆందోళన చెందనవసరం లేదు. ఎంటీయూ 1232 వంగడమైతే 15 నుంచి 70 రోజులు ముంపునకు గురైనా తట్టుకుంటుంది. ముంపునకు గురైన పొలంలో నీరు దిగువకు పోయే విధంగా చేసి ఒక కిలో యూరియా, ఒక కిలో పొటాష్‌లను చల్లుకోవాలి. అలాగే ఒక గ్రాము కార్బన్డిజమ్ లేదా 2 గ్రాముల కార్బన్డిజమ్‌కి మాంకోజెబ్ కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

పిలకల దశలో ఉంటే..

పిలకల దశలో ఉన్న వరి పొలం ముంపునకు గురైతే నీరు బయటకు పోయిన తరువాత ఎకరానికి 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్‌లను వేసుకోవాలి. ఎంటీయూ 1140, ఎంటీయూ 1172, ఎంటీయూ 1223, ఎంటీయూ 1064, పిఎల్ 1100 వంటి రకాలు వారం రోజుల పాటు ముంపును తట్టుకుంటాయి.

తెగుళ్ల సోకే ప్రమాదం

ఇదే సమయంలో వరి పంటకు వివిధ రకాల తెగుళ్ల సోకే ప్రమాదం కూడా ఉంది. ముంపు ప్రాంతాలలో బాక్టీరియా ఆకు ఎండు తెగులు ఆశించడానికి అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఈ తెగులు నివారణకు ఎండిన ఆకులను కత్తిరించి, మంచి నీటితో ఉన్న గాజుగ్లాసులో వేయాలి. అరగంట తరువాత పరిశీలిస్తే తెగులు ఆశించిన భాగాల నుంచి బాక్టీరియా నీటిలోకి ప్రవేశించడం వలన నీటి గాఢత పెరగడం, పసుపు రంగులోకి మారడం జరుగుతుంది. ఈ విధంగా ఉన్న పొలంలో నీటిని 2 లేదా 3 పర్యాయాలు నీరు బయటకు పోయేట్టు చేస్తూ కొత్త నీరు పెట్టడం వలన తెగులు ఉధృతి తగ్గుతుంది.

యుద్ధాలను వ్యతిరేకిస్తూ ర్యాలీ

పెదపూడి: యుద్ధాలను వ్యతిరేకిస్తూ సీఐటీయూ సభ్యులు ర్యాలీ నిర్వహించారు. ఆదివారం అమెరికా సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీఐటీయూ మండల నాయకురాలు,అంగన్‌వాడీ కార్యకర్తల మండల అసోసియేషన్ అధ్యక్షురాలు ఎం.రాజేశ్వరి ఆధ్వర్యంలో పెదపూడి ఎంపీడీవో కార్యాలయం నుంచి మార్కెట్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలోని బి.బాంధవి, ఎ.కనకదుర్గ, జి.సత్యవతి, వి.ఉమాపతి, జి.ఈశ్వరమ్మ, నందం మాధవ, జి.రాంబాబు, వీరలక్ష్మి, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ, బిల్డింగ్ వర్కర్లు, మిడ్ డే మీల్ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా దంత వైద్య శిబిరం

పెదపూడి: అనపర్తి మండలంలోని పొలమూరు గ్రామంలోని మూలారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ,జీఎస్ఎల్ మెడికల్ కాలేజ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. సుమారు 60 మంది డెంటల్ వైద్య నిపుణులో ఇంటింటికి వెళ్లి డెంటల్ వైద్య పరీక్షలు నిర్వహించి 13వేల మందికి డెంటల్ వైద్యం అవసరమని నిర్ధారించారు. మూడు రోజులు పాటు క్యాంపు నిర్వహించి రోగులకు చికిత్స అందిస్తున్నామన్నారు. ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలోని ఎన్డీఏ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వర్షపునీరు తొలగింపునకు చర్యలు

సాక్షి ఇంపాక్ట్

మధురపూడి: కోరుకొండ మండలం పశ్చిమ గానుగూడెం జాతీయ రహదారి 216ఈపై నిలిచిపోతున్న వర్షపు నీరు తొలగించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ చిన్న రాముడు అధికారులను ఆదేశించారు. రోడ్డుపై నిలిచిపోతున్న వర్షపు నీటితో రాకపోకలకు వాహనాలు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నండడంతో ఆదివారం సాక్షి దినపత్రికలో వర్షంతో రాకపోకలకు అవస్థలు శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన జేసీ చిన్న రాముడు అధికారులతో కలిసి కోరుకొండ మండలంలో పర్యటించారు. తొలుత ఆయన కాపవరం వెళ్లారు. కాపవరంలో ప్రభుత్వ బాలికల వసతి గృహం శిథిలావస్థకు చేరడంతో మరో చోటకు మార్చమని అధికారులను ఆదేశించారు. అలాగే ఈ పంట నమోదు ద్వారా కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ జిల్లా అధికారి ఎస్.మాధవరావు, ఏడీ మల్లికార్జునరావు, తహసీల్దార్ వి.సుస్వాగతం తదితరులు పాల్గొన్నారు.



కోరుకొంత తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతున్న జేసీ చిన్నరాముడు

అలరించిన ఆలయ నృత్యం



అలరించిన ఆలయనృత్యం

రాజమహేంద్రవరం సిటీ: విఖ్యాత నాట్య పండితుడు, నర్తన యోగిగా పేరొందిన డాక్టర్ సప్పా దుర్గాప్రసాద్ పునఃసృష్టి చేసిన ఆలయ నృత్య ప్రదర్శన ఆహుతులను అలరించింది. ఆదివారం శ్రీసద్గురు సన్నిధి నెలవారీ కార్యక్రమంలో భాగంగా గోదావరి గట్టున ఉన్న శ్రీత్యాగరాజ నారాయణదాస సేవాసమితి ప్రాంగణంలో డాక్టర్ సప్పా శిష్యులు 12 మంది ఆగమనర్తన రీతిలో ఆలయనృత్యాన్ని ప్రదర్శించారు. సప్పా పరిశోధనా ఫలం పంచభూత నర్తనం, బ్రహ్మ కడిగిన పాదం తదితర కీర్తనలు అద్భుతంగా నర్తించి నవరసాలు పండించారు. ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. సద్గురు సన్నిధి స్థాపకులు మధుసూదన రావు తదితర ప్రముఖులు డాక్టర్ సప్పా దుర్గాప్రసాద్‌ను ఘనంగా సత్కరించి, 12 మంది నర్తకీమణులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందించారు.

అధికారులను అప్రమత్తం చేశాం

- కలెక్టర్ ప్రశాంతి
- కలక్టరేట్‌లో 15 శాఖలతో కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్ర వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా యంత్రాంగాన్ని, క్షేత్ర స్థాయి సిబ్బందిని అప్రమత్తం చేసినట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఆదివారం క్షేత్రస్థాయిలో ఆమె పర్యటించారు. అనంతరం టెలి కాన్ఫరెన్స్ ద్వారా అధికారులను, సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఇప్పటికే బలహీనంగా ఉన్న ఏటిగట్లు, కాలువ గట్ల పరిధిలో తగిన చర్యలు తీసుకున్నామన్నారు. అధికారులు క్షేత్ర స్థాయిలో ఆ మేరకు పనులను చేపట్టి ఇసుక బస్తాలు వేసి గట్లను పటిష్టం చేశారన్నారు. అలాగే కలక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసి మూడు షిఫ్టుల్లో 15 శాఖలకు సంబంధించిన అధికారులు, సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంచామన్నారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. మండల స్థాయి అధికారులు ప్రత్యేక అధికారులు ఆయా మండల ప్రధాన కార్యాలయంలో అందుబాటులో ఉంచి పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు తెలిపారు.

మొక్కలు నాటడం బాధ్యతగా తీసుకోవాలి

- భావితరాల మనుగడ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి
- జిల్లా గిరిజన సంక్షేమ సాధికారిత అధికారిణి కేఎన్ జ్యోతి



మహిళా ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న అధికారులు

రాజమహే ంద్రవరం రూరల్: జీవకోటి మనుగడ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం బాధ్యతగా తీసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ సాధికారిత అధికారిణి, మండల ప్రత్యేకాధికారి కేఎన్ జ్యోతి అన్నారు. ఆదివారం రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్య చౌదరి పిలుపు మేరకు బొమ్మూరులోని ఎన్టీఆర్ నైపుణ్యాభివృద్ధి, మహిళాసాధికార కేంద్రం(మహిళాప్రాంగణం)లో ఆమె మొక్కలు నాటారు. సంస్థ ఇన్‌చార్జి మేనేజర్, సీడీపీవో సీహెచ్‌వీ నరసమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కేఎన్ జ్యోతి, ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, మండల టీడీపీ అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్ తదితరులు పాల్గొని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి అనంతరం మొక్కలు నాటారు. మహిళా ప్రాంగణం సూపరింటెండెంట్ శ్రీదేవి, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు



ఈలకొలనులో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ వేణుశ్రీలక్ష్మి

రాజానగరం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) ఆధ్వర్యంలో కానవరంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 64 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. మండలంలో సీజనల్ వ్యాధులపై ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నామని, ప్రజలు వ్యాధుల బారిన పడకుండా అవసరమైన జాగ్రత్తలు తెలియజేస్తున్నామని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బాలభాస్కర్ తెలిపారు. పీహెచ్‌ఈఓ వైఎస్ రాయుడు, సూపర్‌వైజర్ కె.సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీ ఎం.నాగదుర్గ, హెల్త్ అసిస్టెంట్ బి.శ్రీనివాస్, ఏఎస్ఎంలు కృష్ణవేణి, విశాలాక్షి, ఆశావర్కర్లు విజయకుమారి, ఆశలత పాల్గొన్నారు.

చినకొండేపూడిలో..

సీతానగరం: వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో చినకొండేపూడిలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు వైద్య సేవలు అందించారు. సుమారు 46 మందికి పరీక్షలు చేసి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎం

వ్యాధులు ప్రబలకుండా చర్యలు

రంగంపేట: ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తగా గ్రామాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు ఎంపీడీఓ పి.వెంకటరత్నం అన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఆయా పంచాయితీల ఆధ్వర్యంలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

జ్వరాలపై సర్వే

రంగంపేట: మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం జ్వరాలపై సర్వే నిర్వహించినట్టు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బి.వేణుశ్రీలక్ష్మి తెలిపారు. వర్షాలు కురుస్తుండడంతో గ్రామాల్లో ప్రజలు సీజనల్ వ్యాధులు బారిన పడుతున్న కారణంగా ప్రతి ఇంటికీ వైద్య ఆరోగ్య సిబ్బంది వెళ్లి ఫీవర్ సర్వే చేస్తున్నట్టు తెలిపారు. అందరినీ పరీక్షించి మందులు అందజేశామన్నారు. మందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు.



చినకొండేపూడి ఎస్సీపేటలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రాజు



కానవరంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం



ఎస్టీరాజాపురంలో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్మికులు

చవితి ఉత్సవాలకు సింగిల్ విండో విధానంలో అనుమతి



కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: నగరపాలక సంస్థ పరిధిలో వినాయక చవితి ఉత్సవాల నిర్వహణకు సింగిల్ విండో విధానంలో ఉత్సవ కమిటీలకు అనుమతులు మంజూరుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్టు కమిషనర్ కేతన్ గార్గ్ ఆదివారం తెలిపారు. ఉత్సవాల నిర్వహణకు అనుమతులు జారీ చేసేందుకు నగరపాలక సంస్థ కార్యాలయంలో వివిధ డిపార్టుమెంటు అధికారుల సమన్వయంతో నగరపాలక సంస్థ కార్యాలయంలో పట్టణ ప్రణాళికా విభాగంలో సోమవారం నుంచి 7వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు పోలీసు, రెవెన్యూ, ఫైర్, ఏపీఈపీడీసీఎల్, ఫిషరీస్, ఆర్ అండ్‌బీ, ఇరిగేషన్ డిపార్టుమెంటు అధికారులు అందుబాటులో ఉండి దరఖాస్తులను స్వీకరిస్తారన్నారు. నగర పరిధిలోని ప్రజలు, గణపతి నిర్వహణ కమిటీ సభ్యులు ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా తగు చర్యలు తీసుకొని సజావుగా వినాయక చవితి జరుపుకొని రాజమహేంద్రవరం నగరపాలక సంస్థకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సీతానగరం: తుపాను కారణంగా కురుస్తున్న వర్షాలకు మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ సూచించారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ సూరంపాలెం ప్రాజెక్ట్ నుంచి మిగులు జలాలు విడుదల చేయడంతో ఆదివారం రాత్రి కోరుకొండ మండలం శ్రీరంగపట్నం తదితర గ్రామాల ద్వారా బొబ్బిల్లంక తొర్రిగడ్డ కాలువ చేరుకుని స్లూయిజ్ ద్వారా గోదావరిలో కలుస్తుందన్నారు. గోదావరి వరద లేనందున ప్రాజెక్టు నుంచి వచ్చే మిగులు జలాలతో ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. రాష్ట్ర విపత్తులశాఖ హెచ్చరికలను అనుసరించి, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ప్రజలకు ఏ విధమైన ఇబ్బందులు కలిగిన 62818 67443 నంబర్‌కు కాల్ చేయాలన్నారు. కంట్రోల్ రూమ్ వద్ద వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు.

ఆ సంతానలక్ష్మిది కొత్తతుంగపాడు

రాజానగరం: కోనసీమ జిల్లా, రామచంద్రాపురంలోని శారదా నర్సింగ్ హోమ్‌లో ఒకే కాన్పులో ముగ్గురు పిల్లలకు జన్మనిచ్చింది ఆలపాటి సంధ్యాకుమారి. ఈమెది రాజానగరం మండలం, కొత్తతుంగపాడు గ్రామమని ఆ గ్రామ సర్పంచ్ కోలపాటి వెంకన్న తెలిపారు. ఈ గ్రామానికి చెందిన వీరబాబుకు రావులపాలెం సమీపంలోని సంధ్యాకుమారికి వివాహం జరిగి ఐదేళ్లు అయినాగాని, సంతానం లేకపోవడంతో కలత చెందేవారు. దుబాయ్‌లో పనిచేసే వీరబాబు నాలుగేళ్లుగా ఇక్కడే ఉంటున్నాడు. స్థానికంగానే ఉంటూ వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని చూసుకుంటున్నాడు. తనకు సంతానం లేదని కలవర పడేవాడు. ఈ తరుణంలో సంధ్యాకుమారికి ఒకేసారి ముగ్గురు పిల్లలు పుట్టడం ఆ కుటుంబంలో ఆనందోత్సాహాలకు హద్దులు లేకుండా ఉన్నాయి. ఈ ముగ్గిరిలో ఇద్దరు మగ పిల్లలు, ఒక ఆడ పిల్ల కావడం, తల్లీ, బిడ్డలు ఆరోగ్యంగా ఉండడం ఆనందంగా ఉన్నారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం



కొంకుదురు పిరమిడ్ మాస్టర్ మణికంఠను సత్కరిస్తున్న సభ్యులు

బిక్కవోలు: ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ద్రాక్షరామం పిరమిడ్ మాస్టర్ మణికంఠ అన్నారు. ఆదివారం కొంకుదురు గ్రామంలోని శివరామ కృష్ణా పిరమిడ్ ధ్యాన మందిరం ధ్యాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మణికంఠ మాట్లాడుతూ ప్రతి రోజు ధ్యానం చేయడంలో మనశ్శాంతి లభిస్తుందన్నారు. అనంతరం ధ్యానం వలన కలిగే ప్రయోజనాలు వివరించారు. ఈ కార్యక్రమంలో గొలుగూరి భాస్కరరెడ్డి, గంగావతి ఆధ్వర్యంలో అన్నసమారధన నిర్వహించారు. అనంతరం మాస్టర్ మణికంఠను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పిరమిడ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.